అడవిలో ఆగని వేట

- విద్యుత్ తీగలు, ఉచ్చులు, విషప్రయోగం చేస్తున్న వేటగాళ్లు
- తాజాగా అగర్‌గూడ అడవిలో ఎలుగుబంటి మృతి
- కొరవడిన అధికారుల నిఘా



ఎలుగుబంటి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: జిల్లాలో వన్యప్రాణుల వేట నిత్యకృత్యంగా మారింది. అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు ఒక వైపు చర్యలు చేపడుతున్నా అడవుల్లో వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. మండలంలోని అగర్‌గూడ అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు మంగళవారం ఆలస్యంగా ఎలుగుబంటి కళేబరాన్ని గుర్తించారు. కళేబరంపై గొడ్డలి గాట్లు ఉండటంతో వేటగాళ్ల దాడిలో ఎలుగుబంటి ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాగజ్‌నగర్ మండలం దరిగాం అడవుల్లో రెండు పులులు సైతం విష ప్రయోగంతో మృతిచెందడంతో వన్యప్రాణుల సంరక్షణపై నీలినీడలు అలుముకున్నాయి.

వన్యప్రాణులకు ముప్పు..

జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్ సరిహద్దుల్లో ప్రాణహిత, పెన్‌గంగా, పెద్దవాగులు ప్రవహిస్తున్నాయి. అన్ని కాలాల్లో నీరు పుష్కలంగా లభిస్తుండటంతో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, దుప్పులు, జింకలు, మెకాలు, సాంబార్లతో పాటు అనేక రకాలైన పక్షులు ఆవాసంగా మార్చుకొని జీవనం సాగిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్, దహెగాం మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో అడవులు ఉండగా ఇక్కడ వన్యప్రాణులు మనుగడ సాగిస్తున్నాయి.

వేటగాళ్లతో ప్రమాదం..

జనవరిలో కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం అడవుల్లో రెండు పెద్దపులులు మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కొన్నేళ్లుగా ఆవాసంగా ఏర్పాటు చేసుకున్న వన్యప్రాణులను హతమార్చడానికి వేటగాళ్లు విద్యుత్ తీగలు, ఉచ్చులు, విష ప్రయోగం చేస్తున్నారు. తాజాగా అగర్‌గూడ అడవుల్లో లభించిన ఎలుగుబంటి కళేబరంపై గొడ్డలి గాట్లు ఉన్నాయి. ఎలుగుబంటి విష ప్రయోగం లేదా విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు పంచనామా నిర్వహించిన పశువైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వేటనే ఉపాధిమార్గం..

వేటగాళ్లు వన్యప్రాణుల వేటను వృత్తిగా మార్చుకున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో రాత్రిపూట విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారు. వేటాడిన వన్యప్రాణుల మాంసాన్ని ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తూ వేటనే ఉపాధిమార్గంగా ఎంచుకున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలను వేటగాళ్లు సులువుగా గుర్తిస్తున్నారు. వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో ఉచ్చులు బిగించడం, విష ప్రయోగం, నాటుబాంబులు, పదునైన ఆయుధాలతో వన్యప్రాణులపై దాడులను చేస్తూ హతమారుస్తున్నారు.

ఇటీవల నమోదైన కేసులు..

- డిసెంబరు, 2023లో సిర్పూర(టి) మండలం చింతకుంట వద్ద చుక్కల దుప్పిని వేటాడిన 15 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.
- సిర్పూర్(టి)లో ఈ ఏడాది జనవరి మొదటి వారంలో దుప్పిని వేటాడిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- పెంచికల్‌పేట్ మండలంలో గత ఫిబ్రవరిలో లోడుపల్లి వద్ద కొండగొర్రెను హతమార్చిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

కరువైన నిఘా..

వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో నిఘా కరువైంది. అప్పుడప్పుడూ పక్కా సమాచారంతో అటవీశాఖ అధికారులు దాడులు చేస్తూ వేటగాళ్లపై కేసులు నమోదు చేస్తున్నా తీరుమారడం లేదు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ వన్యప్రాణుల సంరక్షణకు నిఘా ఏర్పాటు చేయాల్సి ఉండగా అటు వైపు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. ఎదైనా సంఘటన జరిగినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు వన్యప్రాణుల వేటగాళ్లపై ఉక్కుపాదం మోపడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అరుదైన ప్రాణులు వేటగాళ్ల ఉచ్చులకు బలైపోతున్నాయి. అటవీశాఖ అధికారులు వన్యప్రాణి వేటగాళ్లపై ఉక్కుపాదం మోపాలని జంతుప్రేమికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అటవీ చట్టం ప్రకారం వన్యప్రాణులను వేటాడటం నేరం. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణకు గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ప్రతీరోజు నీటి వనరులను పరిశీలిస్తున్నాం. ఎలుగుబంటి కళేబరంపై గాయాలను గుర్తించి విచారణ జరుపుతున్నాం. వన్యప్రాణులకు హాని తలపెడితే కేసులు నమోదు చేస్తాం.

- సుధాకర్, ఎఫ్ఆర్వో, పెంచికల్‌పేట్

పుస్తకాలు ఇప్పించండి

- కలెక్టర్‌ను కోరిన నిరుద్యోగులు



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న నిరుద్యోగులు

కెరమెరి: రీడింగ్‌హాల్‌లో పుస్తకాలు లేకపోవడం వల్ల కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కాలేకపోతున్నామని, పుస్తకాలతో పాటు ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని గోయగాంకు చెందిన నిరుద్యోగులు శుభం, నగేశ్, వసంత్, ప్రశాంత్, విజయ్, ప్రేందాస్, సాయిక్రిష్ణ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కోరారు. శుక్రవారం గోయగాంకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. రీడింగ్‌హాల్‌లో సరిపడా పుస్తకాలు లేవని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పుస్తకాలు అందిస్తానని, త్వరలో ఫర్నిచర్ సైతం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎస్వో భరత్, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, ఎంపీడీవో క్రిష్ణారావు, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏఈ నజీమోద్దిన్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

ఆసిఫాబాద్‌రూరల్: అప్పపల్లి వాగుపై చేపట్టిన బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పపల్లి గ్రామస్తులు వంతెన లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడేవారన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రూ.1.85 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టామన్నారు. రైతులు, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా వంతెన పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా రోడ్డు ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, శ్రీనివాస్, నాందేవ్, తిరుపతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



మరమ్మతులు పరిశీలిస్తున్న డీఈవో అశోక్

కెరమెరి(ఆసిఫాబాద్): అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మండలంలోని కల్లెగాం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. వంటగది, మరుగుదొడ్ల, విద్యుత్ పనులను పరిశీలించారు. పగిలిన ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. స్లాబ్ నుంచి నీరు ఉరవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎస్‌వో భరత్, ఏఈ నజీమోద్దిన్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, హెచ్ఎం దివ్యశ్రీ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆనంద్

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసం చేసిన సహకార సంఘం అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒడ్డుగూడ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. తూకంలో జరిగిన మోసం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులను బెదిరించి బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు ధాన్యాన్ని ఎక్కువ తూకం వేస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నేర్పెల్లి అశోక్, మండల కార్యదర్శి నల్లి దామోదర్, రైతులు రౌతు సత్తన్న, శంకర్, దందెర శంకర్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల ఇబ్బందులు



దహెగాం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

దహెగాం: అకాల వర్షాల వల్ల అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు. గురువారం అర్ధరాత్రి ఉరుములతో కూడిన గాలి, వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లో ఉండడంతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సేంద్రియ ఎరువు.. కనుమరుగు

- పశువుల సంఖ్య తగ్గడంతో ఎరువుల కొరత
- రసాయన ఎరువులతోనే పంటల సాగు



కెరమెరిలో అమ్మకానికి ఉన్న పశువుల ఎరువు



ధనోరాలో సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్న అరటితోట

కెరమెరి: గతంలో వేసవి వస్తే అన్నదాతలు పశువుల ఎరువులను పొలాల్లో చల్లేవారు. ఏడాదంతా సేకరించిన పశువుల ఎరువును పొలాల్లో చల్లడం ద్వారా నేలను సారవంతం చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు మారాయి. సేంద్రియ ఎరువుకు బదులు రైతులు రసాయన ఎరువులతో పంటల సాగు చేపడుతున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. రైతుల ఇళ్లల్లో పశువుల సంఖ్య తగ్గడంతో సేంద్రియ ఎరువుకు కొరత ఏర్పడింది. పశువుల ఎరువును రైతులు కొనుగోలు చేసి పొలాల్లో చల్లుతున్నారు.

తగ్గిన సంఖ్య..

గతంలో రైతులు అధిక సంఖ్యలో పశువులను పెంచుకునేవారు. ఒక్కొక్క రైతు ఇంట్లో ఐదు నుంచి పది వరకు పశువులు ఉండేవి. పెద్ద రైతుల ఇళ్లల్లో పశువుల సంఖ్య భారీగా ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. సాగునీటి వసతులు పెరగడంతో బీడు భూములు కనుమరుగయ్యాయి. ఆ ప్రభావం పశువుల సంఖ్యపై పడింది. క్రమేణ పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం మండలంలో పశువులు 18,507, గేదెలు 624, మేకలు 33,253, గొర్రెలు 6,44 ఉన్నాయి.

భూములు నిస్సారం..

రైతుల సేంద్రియ ఎరువులు లేకపోవడంతో రసాయన ఎరువుల వాడకం పెరిగింది. దీంతో పంటల సాగులో చీడపీడలు పెరిగి భూసారం తగ్గుతోంది. పశువుల ఎరువుకు బాగా డిమాండ్ పెరిగింది. కానీ గ్రామాల్లో సైతం పశువుల ఎరువు అందుబాటులో ఉండడం లేదు. చివరికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గొర్రెల మందలను పొలాల్లో ఉంచి సేంద్రియ ఎరువు వినియోగిస్తున్నారు. పశువుల ఎరువు ట్రాక్టర్‌కు రూ. 2000 వరకు ఉంది. అయితే ఖర్చు భరించి కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి లేదు.

పదేళ్లుగా సేంద్రియ పంటలు



నేను పదేళ్లుగా సేంద్రియ ఎరువులతోనే పంటలు సాగు చేస్తున్నాను. నాకున్న ఏడు ఎకరాల్లో అరటి తోటలు, మామిడి, కంది, పెసర, వేరుశనగ, సోయ పంటలు పండిస్తున్నాం. పంటల్లో బాగా దిగుబడి వస్తుంది. కానీ పశువుల సంఖ్య తగ్గడంతో ఎరువు లభించడం కష్టంగా ఉంది.

- కేంద్రె బాలాజీ, రైతు, ధనోరా

అధిక దిగుబడులు



పశువుల ఎరువులతో పంటల్లో అధిక దిగుబడులు వస్తాయి. ప్రతీ రైతు తమ పొలాల్లో పశువుల ఎరువు చల్లితే ప్రయోజనం ఉంటుంది. పంటలను చీడపీడల బెడద నుంచి సంరక్షించవచ్చు. రసాయన ఎరువుల కంటే పెట్టుబడి ఖర్చు కూడా బాగా తగ్గుతుంది.

- ఎ. గోపీకాంత్, ఎంఏవో, కెరమెరి

జాతీయ అవార్డుకు ఎంపిక



ఎంపిక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రణయ్

ఆసిఫాబాద్‌అర్బన్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలోని మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు జిల్లా కేంద్రానికి చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్ ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో ప్రణయ్‌కు నియామకపు పత్రం అందజేశారు. జూన్ 10న మహారాష్ట్రలోని పూణేలో బహుజన సాహిత్య అకాడమీ నిర్వహించే వెస్టర్న్ ఇండియా బహుజన రైటర్స్ 4వ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కోరారు. శుక్రవారం సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చెందూరి మహేందర్ జీఎం కార్యాలయంలో జీఎం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరగడం, వేసవి ఎండల కారణంగా మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తగ్గాయని తెలిపారు. తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు తరచూ రక్తం ఎక్కించాల్సి ఉందని, జిల్లాలో వీరి సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. మరోపక్క ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణులకు అత్యవసర సమయాల్లో రక్తం అందించాల్సి ఉంది. బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిల్వలు అడుగంటాయని దీనిని పెంచడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

'ఆదివాసీలపై దాడులు చేస్తే సహించం'

గుడిహత్నూర్: ఆదివాసీలపై దాడులు చేస్తే సహించబోమని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు ఓ ప్రకటనలో హెచ్చరించారు. జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ యువకుడు మర్సకోల లక్ష్మణ్‌పై కొందరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కలిసికట్టుగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీవో, ఏపీవో

కెరమెరి: పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా హరితహారం మొక్కలు చనిపోకుండా సంరక్షించాలి ఎంపీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శుక్రవారం గోయగాం హరితహారంలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. పెరిగిన మొక్కల ఎదురుగా నేమ్ ప్లెట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతీరోజు మూడుసార్లు నీళ్లు పోయాలన్నారు. ఈజీఎస్ టీఏ నాగోరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బొజ్జిరావు ఉన్నారు.

ఘనంగా చండీయాగం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో జరుగుతున్న స్వాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన నర్సింహా సంహిత చండీయాగం ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి అనంతచార్యుల వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ చండీయాగానికి పండితులు శన్ముక శర్మ బృందం ప్రత్యేక చండీయాగంలో పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు ఆరోగ్య, ఐశ్వర్య ప్రాప్తి కోసం ఈ చండీయాగం నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. పూజల్లో ఏరియా జీఎం మనోహర్ సవిత, రామగుండం జీఎం చింతల శ్రీనివాస్ లక్ష్మి దంపతులు, అధికారులు భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్మానుష్యం



నిర్మానుష్యంగా మారిన జైనూర్

జైనూర్: ఘర్షణల కారణంగా మండల కేంద్రంలో నాలుగు రోజులుగా 144 సెక్షన్ అమలులో ఉండడంతో మండల కేంద్రంలోని రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మండల కేంద్రంలో శాంతి భద్రతల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ సదయ్య, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

లింగాపూర్: మండలంలోని కిమానాయక్ తండా గ్రామంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి బానోత్ బంగిబాయి, జాదవ్ రాజేందర్‌ల ఇళ్లకు చెందిన రేకులు ఎగిరిపోయాయి. దీంతో ఇళ్లల్లోని నిత్యావసర సరుకులు పూర్తిగా తడిచిపోయాయి. దీంతో మండల పంచాయతీ అధికారి ఉమర్‌షరీఫ్, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జగదీశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మహోత్సవాలు



హారతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో పండితులు షణ్ముకచారి ఆధ్వర్యంలో కుంకుమ పూజ, హోమ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: మండల వ్యాప్తంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగాపూర్: ఉట్నూర్ నుంచి సిర్పూర్(యూ) వరకు విద్యుత్‌లైన్ వార్షిక మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సల్ల ఆదర్శ తెలిపారు.

'ఇతరులతో పని చేయించొద్దని వినతి'

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లలో తమ బంధువులతో పనులు చేయించొద్దని పలువురు హమాలీలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం మార్కెట్ యార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఇతరులతో హమాలీ పని చేయించవద్దని కోరారు. హమాలీల సమస్యలపై మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి నార మనోహర్‌తో చర్చించారు. వారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

'ఆత్మవిశ్వాసమే మహిళలకు భరోసా'

ఇచ్చోడ: ఆత్మ విశ్వాసమే మహిళలకు భరోసా అని శిక్షకురాలు శృతి అన్నారు. మండల కేంద్రంలో వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆత్మరక్షణ, సురక్ష, సాంస్కృతిక పరిరక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు పలు అంశాలపై వారం పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు కల్పన, మంజుల, లత, అంజలి పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

నేరడిగొండ: మండలంలో నేటి నుంచి జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కోర్టికల్‌లోని యూపీ దాబా యజమాని అశోక్ మహరాజ్ స్పార్టన్ వారియర్స్ జట్టు సభ్యులకు శుక్రవారం క్రీడా దుస్తుల కోసం రూ.10వేల నగదు అందజేశారు. క్రీడాకారులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. జట్టు కెప్టెన్ అనిల్‌కుమార్, లీగ్ నిర్వాహకులు పాండు, యోగి, జైరాం పాల్గొన్నారు.